## క్లుప్తంగా

### ఘనంగా సత్తెమ్మ తల్లి సంబరం



సత్తెమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో సత్తెమ్మ తల్లి సంబరాన్ని సబ్బెళ్ల వంశీకుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకాలు చేసి అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పూజల్లో ఆంధ్రా షిర్డీ సాయి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### నేడు కనకదుర్గమ్మ వార్షిక తీర్థ మహోత్సవం



చంద్రేడులో శ్రీదేవి కనకదుర్గ అమ్మవారు

రంగంపేట: మండలంలోని చంద్రేడులో కొలువైయున్న శ్రీదేవి కనకదుర్గమ్మ అమ్మవారి వార్షిక తీర్థ మహోత్సవం సోమవారం రాత్రి నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలదండలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తీర్థం సందర్భంగా ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

### నేడు దంత వైద్యశిబిరం

సీతానగరం: ఇనుగంటివారిపేటలోని శ్రీద్వారకామాయి ఫంక్షన్ హాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ దంత వైద్యశిబిరం నిర్వహిస్తామని శ్రీసాయి సేవా సమితి ఇనుగంటివారిపేట చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సత్యం లక్ష్మి తెలిపారు. శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం 16వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అయన్స్ క్లబ్ ఆఫ్ రాజమండ్రి సెంటిన్నియల్ పవర్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని విజయ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పటల్ సౌజన్యంతో జరిగే ఈ శిబిరంలో డాక్టర్ యు.వెంకటరాజు చౌదరి సేవలందిస్తారన్నారు.

### ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర

పెదపూడి: మండలంలోని వేండ్ర గ్రామంలో నర్ల వారి సత్తెమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారిని స్థానికులు కొలుస్తారు. ఆదివారం ఉదయం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### వెండి నామం బహూకరణ



దాత బహూకరించిన వెండి నామం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలో మంచి నీటి చెరువు వద్ద కొలువైన శ్రీమోక్షా వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.25 వేల విలువైన 250 గ్రాముల వెండి నామాన్ని ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తేతల శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామానికి చెందిన దాతలు కర్రి క్రీస్తురెడ్డి, లలితాలక్ష్మి దంపతులు వెండి నామాన్ని ఇచ్చారన్నారు. అనంతరం పూజలు చేసి స్వామివారికి అలంకరించామని చెప్పారు.

### వైభవంగా శిఖర ప్రతిష్ఠోత్సవం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

రాజానగరం: స్థానిక శ్రీరాజలింగేశ్వరస్వామి, శ్రీరాజగోపాలస్వామి ఆలయ సముదాయంలో పునర్నిర్మించిన రాజరాజేశ్వరిదేవి ఆలయంపై శిఖర ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దాత కుందుల బలరామకృష్ణ దంపతులచే శిఖర కలశానికి అభిషేకం చేసి, హోమం చేశారు. ఈ సందర్భంగా భక్తులతో లలిత సహస్రనామ పారాయణ జరిగింది. రెగడమిల్లి రాంబాబు బ్రహ్మత్వంలో శిఖర ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

### సమస్యలపై నిరంతర పోరాటం

మధురపూడి: ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న తనకు ఓటు వేసి గెలిపించాలని సీపీఐ ఎంఎల్ పార్టీ (స్వతంత్ర) అభ్యర్థి పలివెల వీరబాబు ప్రజలను కోరారు. ఆయన ఆదివారం కోరుకొండలో విలేకరులతో మాట్లాడారు. రాజానగరం నియోజకవర్గం నుంచి తాను పోటీ చేస్తున్నట్టు తెలిపారు. సీలింగ్ భూములను పేదలకు పంచాలని, జగనన్న కాలనీల్లో పేద వర్గాలకు ఇళ్లు కట్టి ఇవ్వాలన్నారు.

# వలంటీర్లు.. సంక్షేమ వారధులు

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరవేత
- ప్రజల మన్ననలు పొందుతున్న వలంటీర్లు
- అవార్డులు, నగదు పురస్కారాలతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



పందలపాకలో అవార్డులు అందుకున్న వలంటీర్లు

బిక్కవోలు: గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయం పరిధిలో ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ అత్యున్నత సేవలతో ప్రజల మన్నలు పొందుతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ వారధులుగా ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ నాలుగో ఏడాది పూర్తి చేసుకుని ఐదో ఏడాదిలో ప్రవేశించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇంటి ముంగిటకే అందిస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతుంది. అందుకే ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లను ఎంపిక చేసి వారిని ప్రోత్సహించేలా ప్రభుత్వం ఏటా వారికి సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు అందిస్తోంది. సేవా వజ్ర పురస్కారానికి రూ.45 వేలు, సేవా రత్న పురస్కారానికి రూ.30 వేలు, సేవా మిత్ర పురస్కారానికి రూ.15 వేల చొప్పున నగదు అందించి వలంటీర్లను సత్కరిస్తున్నారు.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఆగస్టు 15వ తేదీన వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అనపర్తి నియోజకవర్గంలో 79 సచివాలయాల పరిధిలో 1,614 మంది వలంటీర్లు ప్రజలకు సేవలందిస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ వచ్చాక ప్రతి పనికి మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సిన అవస్థలు తప్పాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుతుండగానే ఇంటి తలుపు తట్టి మరీ పింఛన్ సొమ్ము అందిస్తుండడంపై పింఛన్‌దారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ ఇవ్వడానికి ప్రతి నెలా రోజుల తరబడి తిప్పడమే కాకుండా సిగ్నల్ లేదంటూ కొండలు, గుట్టలు ఎక్కించేవారంటూ గుర్తు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే వలంటీర్ వ్యవస్థపై సర్వాత్రా హర్షం వ్యక్తమవుతుంది. మరోవైపు ప్రభుత్వం తమ సేవలను గుర్తించి నగదు పురస్కారాలు అందిస్తుండడంపై వలంటీర్లు సైతం ఆనందంగా ఉన్నారు. పైగా వలంటీర్లకు ఇచ్చే పురస్కారాల ఎంపిక సైతం వారి పనితీరు ఆధారంగా పారదర్శకంగా నిర్వహిస్తున్నారు.

**అనపర్తి నియోజకవర్గంలో వలంటీర్లకు అందించిన పురస్కారాల వివరాలు**

| మండలం | సేవా వజ్ర | సేవా రత్న | సేవా మిత్ర | నగదు (రూ.లక్షల్లో) |
|---|---|---|---|---|
| అనపర్తి | 1 | 5 | 449 | 69.30 |
| బిక్కవోలు | 2 | 5 | 421 | 65.55 |
| రంగంపేట | 2 | 3 | 369 | 57.15 |
| పెదపూడి | 0 | 6 | 351 | 54.45 |
| మొత్తం | 5 | 19 | 1590 | 246.45 |

#### ఎంతో సంతృప్తినిస్తోంది



గ్రామంలోనే ఉంటూ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. నాకు కేటాయించిన కుటుంబాలకు ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని సకాలంలో అందించడం ఎంతో సంతృప్తినిస్తోంది.

– కరుపోతు నవీన్, వలంటీర్, ఊలపల్లి

#### వరుసగా రెండు అవార్డులు వచ్చాయి



నా పరిధిలోని కుటుంబాలకు వారి ఇంటి సభ్యురాలిగా సేవలందించడం సంతోషంగా ఉంది. గతేడాది సేవా రత్న, ఈ ఏడాది సేవా వజ్ర అవార్డు వచ్చాయి. ప్రభుత్వం బాగా పనిచేస్తున్న వలంటీర్లను గుర్తించి ఏటా ప్రోత్సాహకాలు అందిస్తుండడంతో మరింత ఉత్సాహంగా పనిచేయాలనిపిస్తుంది.

– కొప్పిశెట్టి సౌందర్య, వలంటీర్, బలభద్రపురం

#### అవార్డు మరింత బాధ్యత పెంచింది



ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సకాలంలో చేరవేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాకు ఈ ఏడాది సేవా వజ్ర అవార్డు వచ్చింది. అవార్డు మరింత బాధ్యత పెంచింది. మా కష్టాన్ని గుర్తించి అవార్డుతో ప్రోత్సహిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– కె.భాగ్యలత, వలంటీర్, బలభద్రపురం

### ముఖ్యమంత్రి సహాయనిధి చెక్ అందజేత



లోవరాజుకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: మండల పరిధిలోని మర్రిపూడి గ్రామానికి చెందిన వార్డు మెంబరు పులపకూర లోవరాజుకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.67 వేలు మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును లోవరాజుకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి లోవరాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వేము మాధవి, వేము చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

### పీఆర్సీ 23 శాతం వర్తింపుపై హర్షం

మధురపూడి: సమగ్ర శిక్ష అభియాన్‌లో పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం గత పీఆర్సీ 23 శాతాన్ని వర్తింపజేయడంపై యూనియన్ రాష్ట్ర కన్వీనర్ జాకబ్ రాజు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

### శరవేగంగా రహదారి నిర్మాణం



రఘుదేవపురం వద్ద జరుగుతున్న రోడ్డు పనులు

సీతానగరం: కాతేరు – సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం రఘుదేవపురం శివారు వరకూ వచ్చిన ఆగిన రోడ్డు పనులు పదిహేను రోజుల నుంచీ వేగవంతమయ్యాయి. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రఘుదేవపురం సెంటర్ వద్ద వ్యాపారస్తులతో మాట్లాడి, భవిష్యత్తు తరాల కోసం సహకరించాలని కోరారు. వారితో చర్చించిన అనంతరం వ్యాపారస్తులు రోడ్డు విస్తరణ పనులకు ఎటువంటి వ్యతిరేకం కాదని, రోడ్డు పనులు యథాతథంగా చేసుకోవచ్చని తెలిపారు. ఏమైనా అడ్డంకులు ఉంటే తొలగించడానికి అంగీకారం తెలిపారు. ఇప్పటికే దాదాపు తొంభై శాతం పనులు పూర్తయ్యాయి.

## జగనన్న కాలనీలో వీధులకు ప్రముఖుల పేర్లు




కొత్తూరు జగనన్న కాలనీలో వీధులకు నామకరణం చేసిన శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

**కొత్త సంస్కృతికి నాంది పలికిన ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి**

అనపర్తి: ప్రజాప్రతినిధులుగా, గ్రామ పెద్దలుగా గ్రామాభివృద్ధికి, గ్రామానికి వివిధ రూపాల్లో సేవలందించిన ప్రముఖులు, ప్రజాప్రతినిధుల పేర్లు జగనన్న కాలనీలోని వీధులకు నామకరణం చేసే గొప్ప సంస్కృతికి నాంది పలికారు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి. నవరత్న పథకాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన నేపథ్యంలో అనపర్తి శివారు కొత్తూరులో మొత్తం 36.85 ఎకరాల్లో 1,546 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. దీంతో కొత్తూరులోని వైఎస్సార్ జగనన్న కాలనీ కొత్త ఊరును తలపించేలా రూపుదిద్దుకుంది. ఈ కాలనీలో మొత్తం 43 వీధులు ఏర్పాటు కావడంతో ఒక్కో వీధికి ఒక చిరునామాను కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆలోచించారు. గ్రామానికి వివిధ రూపాల్లో సేవలందించిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దల పేర్లు కాలనీలోని 43 వీధులకు పెట్టడంతో పాటు ఆయా ప్రముఖుల కుటుంబీకుల చేతుల మీదుగానే ఆవిష్కరింపజేశారు. దీంతో ప్రముఖుల పేర్లు చిరస్థాయిగా ఉండేలా చేసిన ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిని ప్రతిఒక్కరూ అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వ్యాపారవేత్తలు సబ్బెళ్ల అమ్మిరెడ్డి, చింతా గోపాలకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ కర్రి ధర్మారెడ్డి, వర్తక సంఘం అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, తేతలి రాధాకృష్ణారెడ్డి, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి బుల్లిమోహన్‌రెడ్డి, ఎన్‌సీఆర్ మురళి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## త్రిమూర్తులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు



త్రిమూర్తులు స్వామివార్ల ఆలయంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: మండలంలోని నరేంద్రపురంలో పంట పొలాల మధ్య కొలువైన త్రిమూర్తులు స్వామివార్ల (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు)ను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. ఉత్సవాల నిర్వాహకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రాంగణంలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ త్రిమూర్తులు ఆలయాలు దేశంలో చాలా అరుదుగా ఉంటాయని, ఈ ఆలయం రాజానగరం నియోజకవర్గంలోని నరేంద్రపురంలో ఉండటం ఈ ప్రాంత వాసుల అదృష్టమన్నారు. ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. త్రిమూర్తులు స్వామివార్ల 77వ తీర్థ మహోత్సవాలు శనివారం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు పంపన శ్రీను, ప్రగడ రామచంద్రరావు, వడ్డి చిన్న, ప్రగడ వీరబాబు, ఉల్లి విష్ణు, వెంకట్రావు, వీరరాఘవులు, తంగెళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### బలభద్రపురంలో అగ్ని ప్రమాదం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించిందని అనపర్తి అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని బి.సత్యవతి అనే మహిళకు చెందిన పెంకుటింట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రేగాయన్నారు. స్థానికుల సమాచారంతో తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి మంటలు అదుపులోకి తీసుకొచ్చామన్నారు. ప్రమాదంలో సుమారు రూ.2.5 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందన్నారు.

## జగనన్న పాలనలో రోడ్లకు మహర్దశ



రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- బుచ్చెంపేట – మునగాల రోడ్డుకు శంకుస్థాపన

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఇవి గ్రామాలను అనుసంధానం చేయడంతో పాటు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. కోరుకొండ మండలం బుచ్చెంపేట గ్రామంలో బుచ్చెంపేట – నుంచి మునగాల వెళ్లే పుంత రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 4.5 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డును రూ.2.6 కోట్ల పీఎంజీఎస్‌వై నిధులతో నిర్మించనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ నాయకులు అడబాల సీతారామకృష్ణ, మండపాక శ్రీను పాల్గొన్నారు.

## జగన్ సంక్షేమ పాలనకు ప్రజాదరణ



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి స్వాగతం పలుకుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

- బెంబేలెత్తుతున్న ప్రతిపక్షాలు
- జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలనకు లభిస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు బెంబేలెత్తిపోతున్నాయని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. దివాన్ చెరువులో పార్టీ నాయకులు పలివెల స్వామి, మార్గాని శ్రీను ఆధ్వర్యంలో టీడీపీ, జనసేనకు చెందిన 30 మంది కార్యకర్తలు ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ జక్కంపూడి విజయలక్ష్మి పార్టీ కండువాలను వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు నియోజకవర్గంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై అనేక మంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో మలపర్తి ఏసు, వేమగిరి విజయ, అయినవిల్లి కుమార్, మండపల్లి బుజ్జి, బత్తిన రాజు తదితరులు పాల్గొన్నారు.

# డాగ్ షో అదుర్స్..







జవహర్ లాల్ నెహ్రూ రోడ్డులోని దారా గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన బ్రీడ్స్ డాగ్ షో చాంపియన్ షిప్ పోటీలు జంతు ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా తరలి వచ్చిన వివిధ రకాల జాతుల కుక్కలు ఆహూతులను అలరించాయి. బౌ అండ్ వవ్ కొ సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచే కాకుండా, భీమవరం, విజయవాడ, విశాఖపట్నం నుంచి కూడా జంతు ప్రేమికులు తమ కుక్కలతో తరలివచ్చారు. నిర్వాహకులు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో సుమారు 20 వేల వీధి కుక్కలు తిరుగుతున్నాయన్నారు. వీటిలో కొన్ని ప్రమాదాల బారినపడి కాళ్లు విరగ్గొట్టుకుంటున్నాయని, మరికొన్ని చర్మ వ్యాధులతో బాధపడుతున్నాయన్నారు. ఈ షో ద్వారా వచ్చే ఆదాయాన్ని వాటి చికిత్సకు ఖర్చుచేస్తామని తెలిపారు. పోటీల్లో న్యాయ నిర్ణేతగా దినేష్ గౌడ్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఈవెంట్ ఆర్గనైజర్ ఆర్‌జేవై గణేష్, ఆర్సి స్టూడియో అధినేత చింతారాజు, ఎస్ కాంటెడ్ కేఫ్ అధినేత దివ్య, శ్రీనివాస్, అవినాష్ పాల్గొన్నారు.

– రాజమహేంద్రవరం సిటీ







### ప్రశాంతంగా గ్రూప్ - 2 పరీక్షలు

రాజానగరం: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్ – 2 పరీక్షలు మండలంలో ఎంపిక చేసిన కేంద్రాలలో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ జరిగిన ఈ పరీక్షలకు వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు సకాలంలో చేరుకున్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కేంద్రంలో 228 మందికి గాను 195 మంది, గైట్ కళాశాల కేంద్రంలో 900 మందికిగాను 779 మంది, తూర్పుగానుగూడెం ఐఎస్‌టీఎస్ మహిళా కళాశాల కేంద్రంలో వెయ్యి మందికి గాను 866 మంది, భూపాలపట్నంలోని రైట్ కళాశాల కేంద్రంలో 864 మందికిగాను 750 మంది, పాలచర్లలోని బీవీసీ కళాశాల కేంద్రంలో 600 మందికిగాను 524 మంది, కానవరంలోని గాయత్రీ జూనియర్ కళాశాల కేంద్రంలో 400 మందికిగాను 340 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ పర్యవేక్షించారు.

### ఏప్రిల్ 16న 80 వసంతాల వేడుక

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) 80 వసంతాల వేడుకను ఏప్రిల్ 16న తాపేశ్వరంలో నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం నెహ్రూనగర్ మున్సిపల్ హైస్కూల్లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యపై అవగాహన కల్పిస్తోందన్నారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు అప్పయ్య శాస్త్రి, నగర శాఖ అధ్యక్షుడు డేవిడ్ లివింగ్‌స్టన్, జిల్లా అధ్యక్షులు పింగళి శ్రీనివాస్ పాల్గొన్నారు.